

నేడు మండలంలో విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- శాంతిపురం: 8వ తేదీ శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 132/33 కేవి శాంతిపురం సబ్ స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని డివిజనల్ ఇంజనీర్, హిమ్మత్ సాగర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిపురం, రామకుప్పం, వి కోట మండలాల పరిధిలో గల 33/11 కేవి సబ్ స్టేషన్ (మొత్తం 22 సబ్ స్టేషన్లు)లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వుంటుందని పై మండలాల వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

టిడ్కో ఇండ్లకు మోక్షం లభించేనా..?

- రుణాలు చెల్లింపుపై బ్యాంకర్ల ఒత్తిడి

ఇళ్లు లేని పేద, మధ్యతరగతి టిడ్కో ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. 2014 -19 మధ్య కాలంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని పేదలకు డబుల్ బెడ్‌రూమ్, సింగ్నల్ బెడ్ రూమ్ పేరిట టిడ్కో ఇళ్ల కోసం నగర పాలక సంస్థ, పురపాలిక సంస్థ ద్వారా దరఖాస్తులు కోరింది. చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో దాదాపు 5 వేలకు పైగా టిడ్కో ఇండ్ల కోసం దరఖాస్తులు అందాయి. ఇందులో అర్హులుగా గుర్తించి 2,800 మందికి చిత్తూరుకు ఏడు కిలోమీటర్ల దూరంలోని పూనేపల్లి వద్ద టిడ్కో అపార్టుమెంట్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.



పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో ఇండ్లను పరిశీలిస్తున్న టిడ్కో ఛైర్మెన్ అజయ్‌కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 2019 ఎన్నికల నాటికి టిడ్కో ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా లబ్ధిదార్ల ఎంపిక లాటరీ పద్ధతి ద్వారా కేటాయింపులు కూడా చేశారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు గ్రౌడ్‌ఫ్లోర్ కేటాయించారు. ఇదిగో అదిగో అంటుండగానే సాధారణ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల్లో తెలుగుదేశం ఘోర ఓటమి చవిచూడటంతో టిడ్కో ఇండ్ల కేటాయింపు అటకెక్కింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి పుంగనూరు మినహా ఇతర ప్రాంతాల్లో టిడ్కో ఇండ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించకపోవడతో టిడ్కో ఇంటి నిర్మాణం కోసం బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు చెల్లించాలంటూ బ్యాంకులు లబ్ధిదార్లకు నోటీసులు జారీ చేశాయి. టిడ్కో ఇండ్ల కోసం కళ్ళు కాయలు కాసేలా ఐదేళ్ళుగా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. 2024 సాధారణ ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం పూనేపల్లి వద్ద టిడ్కో ఇండ్ల సముదాయానికి మౌళిక వసతుల కల్పిన కోసం నిధులు కేటాయించింది.

రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతి ఏర్పాట్లు చకచకా పూర్తి చేసేందుకు ప్రయత్నించినా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో టిడ్కో ఇండ్ల కేటాయింపుకు బ్రేక్ పడింది.


2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాది గడుస్తున్నా టిడ్కో ఇండ్ల లబ్ధిదార్ల సొంత ఇంటి కళ సాకారం.. కళగానే మిగిలింది. ఇటీవల మూడు రోజుల క్రితం టిడ్కో ఛైర్మెన్ అజయ్ కుమార్ చిత్తూరు నగరంకు సమీపంలోని పూనేపల్లి టిడ్కో ఇండ్ల అపార్టుమెంట్లను పరిశీలించారు. ఈ ప్రాంతంలో నిర్మించిన 2,800 ఇండ్లు నిర్మిస్తే 2,400 ఇండ్లుకు మౌళిక వసతులు పూర్తి చేశామని, మరో 400 ఇండ్లకు సంపూర్ణ మౌళిక వసతులు కల్పించి ఈ ఏడాదిలోగా అంటే డిసెంబర్ నాటికి లబ్ధిదార్లకు కేటాయిస్తామని స్పష్టం చేయడంతో లబ్ధిదార్లలో అశలు చిగురించాయి.

రుణాల చెల్లింపుపై బ్యాంకర్ల ఒత్తిడి

పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో ఇండ్ల లబ్ధిదారులు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించాలంటూ బ్యాంకర్ల నుంచి లబ్ధిదార్లకు ఏడాది నుండి బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తున్నారు. సొంత ఇంటి కళ నెరవేరకపోగా బ్యాంకుల నుండి నోటిసులు అందడంతో తీసుకున్న రుణం, వడ్డీలు ఎలా చెల్లించాలంటూ సతమవుతున్నారు. టిడ్కో ఛైర్మెన్ ప్రకటించిన విధంగా ఏడాదిలోగా ఇండ్లు కేటాయింపు పూర్తి చేసి బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలపై వడ్డీ లేకుండా మాఫీ చేయాలని కోరుతున్నారు. మొదట్లో టిడ్కో ఇండ్లపై ఆసక్తి చూపిన లబ్ధిదార్లు ప్రస్తుతం అపార్టుమెంట్ నివాసాల్లో ఉండేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. దాదాపు ఎనిమిదేళ్ళు లబ్ధిదార్లు ఎదురు చూపులే కారణంగా తెలుస్తోంది. పైగా పిల్లల్ని చదువుల కోసం చిత్తూరు నగరానికి పంపాల్సి ఉంటుంది. చిరుద్యోగులు, చిరు వ్యాపారులు, కార్మికులు ప్రతి రోజూ ఎనిమిది కిలోమీటర్లు చిత్తూరు వచ్చిపోవాల్సి ఉంటుంది.

పగటి వెలుగులతో...
ప్రజాధనం ఆవిరి

పూతలపట్టు మండల పరిధిలో వీధి దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. ప్రాంతాలతో తేడా లేకుండా మండలం మొత్తం ఈ సమస్య ఉంది. సూర్యోదయం అయ్యేసరికి ఆరాల్సిన వీధి దీపాలు అలాగే వెలుగుతూనే ఉండడంతో విద్యుత్ బిల్లులు తడిసి మోపుడు అవుతుంది. దీంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృధా అవుతోంది. మండల పరిధిలో ఇక ఇవి బాగుపడవని జనం పెదవి విరిస్తున్నారంటే ఈ సమస్యపై ఎంతగా విసిగిపోయారో అర్థం చేసుకోవచ్చు.



- అస్తవ్యస్తంగా వీధి దీపాల నియంత్రణ

ప్రజాశక్తి- పూతలపట్టు

మండల పరిధిలో కొన్నేళ్లుగా వందలాది లైట్లు రోజంతా వెలుగుతూనే ఉన్నాయి. గతంలో వీటిపై మండల అధికారుల సమావేశాలు.. ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేసేవారు. అధికారులు నామమాత్రంగా కొన్నింటిని సరిచేసి చేతులు దులుపుకునేవారు మూడు రోజులకే అవి పగటి పూట వెలిగేవి.. ప్రధానంగా థర్డ్ వైర్ సమస్య ఈ దుస్థితి కొనసాగుతోంది. పాత కేబుల్ వైర్ కాలిపోవడంతో నియంత్రణ కొరవడింది.

గృహ, వాణిజ్య అవసరాలతో పాటు వీధి దీపాలకు ఒకే లైన్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుంది. వివిధ దీపాలకు సరఫరా నిమిత్తం ప్రత్యేకంగా మూడో లైన్ థర్డ్ వైర్ ఉండాలి. అయితే కొన్నిచోట్ల మండలంలో అవి లేకపోవడంతో వీధి దీపాలపై అదుపు లోపించింది. ఇళ్లకు వెళ్లే లైను మీదే వైర్లు కలిసిపోయి ఉండడం.. ఫలితంగా నిరాటకంగా వెలుగుతున్నాయి. కొన్నిచోట్ల కేబుల్ కాలిపోయి ఇదే పరిస్థితి నెలకొంది. వీటిపై మండల విద్యుత్ అధికారులు ఎవరికి వారు తమకు ఉన్న నిబంధనలను వివరిస్తున్నారు. ఫలితంగా సమస్య పరిష్కారంలో జాప్యం అనివార్యం అవుతుంది.

వేల రూపాయలు వృధా..

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కలిసి వందలాది లైట్లు రోజంతా వెలుగుతున్నట్లు అంచనా.. దీనిపై ఆయా సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారులకు వివరిస్తున్న అంతంత మాత్రం స్పందన ఉండడంతో నెలకు వేల రూపాయల వరకు ప్రజాధనం ఆవిరి అవుతోందని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

- నరసింహులు, విద్యుత్ శాఖ ఏఈ

మండలంలో పగటిపూట వెలుగుతున్న వీధి దీపాలను పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం. ఇదివరకే అనేకచోట్ల వీధి దీపాలకు ప్రత్యేకంగా స్విచ్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

ఇసుక తీస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): ప్రజావసరాలకు కాకుండా వ్యాపార నిమిత్తం ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ఇసుక రవాణా చేసేవారిని హెచ్చరించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ల యజమానులకు, డ్రైవర్లకు పోలీస్‌స్టేషన్ నందు సమావేశపరచి హెచ్చరికలు జారీ చేశారు. ఇసుకను అక్రమంగా తమిళనాడుకు సరఫరా చేసినట్లయితే కేసులు నమోదుచేసి అవసరమైతే పీడీ యాక్ట్ కూడా పెట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ట్రాక్టర్‌కు జీపీఎస్ అమర్చుకోవాలన్నారు. అవసరాలకు మాత్రమే ఇసుకను తీసుకోవాలని వ్యాపార ఉద్దేశ్యంతో ఇసుక తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటుందన్నారు. నగరి మీదుగా కుశస్థలి నదిలో ఉన్న ఇసుకను సత్రవాడ, కెవీపీఆర్ పేట, తెరణి, మిట్టపాళెం, ఏకాంబరకుప్పం ఏరియాలలో జనసంచారం ఉన్నచోట ప్రజలు ఉన్నచోట ట్రాక్టర్లని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఇసుకని రవాణా చేయడం జరుగుతుందని, ఈ కారణంగా మహిళలు, వృద్ధులు, స్కూళ్లకు వెళ్లే చిన్నపిల్లలకు భయభ్రాంతులకు లోనై అప్పుడప్పుడు చిన్నచిన్న ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఉదయం 7 నుంచి 11 వరకు సాయంత్రం నాలుగు తర్వాత ట్రాఫిక్ ఉన్న పట్టణ ఏరియాలో రవాణా చేయకూడదన్నారు. ప్రతి ట్రాక్టర్‌లో రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవర్ లైసెన్స్ కచ్చితంగా కలిగి ఉండాలన్నారు. సీఐ మహేశ్వర్, ఇసుక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నులిపురుగులతో పొంచి ఉన్న ప్రమాదం

వాల్ పోస్టర్ ఆవిష్కరించిన కమిషనర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలో ఈనెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆల్బెండజోల్ మాత్రలను పాఠశాల హెచ్‌ఎంకు అందించారు. 10వ తేదీ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోనివారికి 17వ తేదీన ఇవ్వాలన్నారు. అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, హెచ్‌ఎం పూర్విక పాల్గొన్నారు.

పూతలపట్టు: నులిపురుగులతో ప్రమాదం పొంచి ఉందని మండల అభివృద్ధి అధికారి నాగరాజా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆశ వర్కర్లకు నులి పురుగులకు సంబంధించిన మాత్రలను పంపిణీ చేశారు. విద్యార్థులకు మాత్రలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు.

కార్వేటినగరం: నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో 10వ తేదీ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోడపత్రికలను అధికారులతో కలసి ఆవిష్కరించారు. సచివాలయ మహిళా పోలీసులు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

విజయపురం: మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోమశేఖర్ అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరిగింది. ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవడం వల్ల రక్తహీనతను తొలగించుకోవచ్చు, పోషకాహార, లోపాన్ని తొలగించవచ్చు అన్నారు. ఎంపీడీవో, ఎమ్మార్వో, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పాల్గొన్నారు.



శాంతిపురం: స్థానిక మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఏపిఆర్.కుమార్ శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రల వినియోగం, నివారణ దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరించారు. మండలానికి కేటాయించిన 7148 ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు.



పెద్దపంజాణి: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని పెద్దపంజాణి, రాయలపేట వైద్యాధికారులు మురళి, నందిని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలాజీ, ఎంపీపీ యస్.రెడ్డప్ప వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ మాత్రల పంపిణీ చేశారు.

సోమల: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పొదలకుంటపల్లి పంచాయతీ కార్యదర్శి ఫయాజ్ అన్నారు. పంచాయతీ పరిధిలోని తుగడం వారి పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో కిషోర్ బాలికలకు పాఠశాల విద్యార్థులకు జాతీయ నులిపురుగుల దినోత్సవం మరియు కిశోర బాలిక వికాస్ పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సోమల వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.


ఇన్‌ఛార్జి డిఆర్‌డిఏ పీడీ తనిఖీ



కోనపల్లి గ్రామ సచివాలయంలో తనిఖీ చేస్తున్న పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి- యాదమరి: మహిళా సమైక్య కార్యాలయాన్ని చిత్తూరు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ, ఇంచార్జ్ డిఆర్డీఏ పీడీ శ్రీదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే కోనపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో బీసీ కార్పొరేషన్ కింద ఎంతమంది ఆన్లైన్‌లో రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిసి కార్పొరేషన్ రుణాలకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకునే విధంగా సచివాలయం పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని మహిళ సమైక్య కార్యాలయంను తనిఖీ చేసి కార్యాలయంకు సిబ్బంది ఎన్ని గంటలకు విధులకు హాజరవుతున్నారు, మహిళ పొదుపు సంఘాల పనితీరు ఎలా ఉంది, కార్యాలయ రికార్డులు నిర్వహణ, ఎంతమందికి రుణాలు ఇచ్చారు, తీసుకున్న రుణాలు సక్రమంగా కడుతున్నారా లేదా, సంఘాల పనితీరు, పర్యవేక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం క్రింద ఉన్న బల్క్ మిల్క్ సెంటర్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. మండలం నుండి ఎంత పాలు సేకరిస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. మహిళా సంఘం సభ్యులు బీసీ కార్పొరేషన్ రుణాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఈశ్వరమ్మ, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణ నడిబొడ్డున కౌండిన్య ఏటి గడ్డన ఉన్న ఖాళీ స్థలంలో పట్టణానికి చెందిన కొందరు షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటిపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు అందడంతో జెసిబితో అక్రమ కట్టడాలను శుక్రవారం కూల్చివేశారు. గతంలో ఏటి గట్టున ఏర్పాటు చేసుకున్న బంకులను వర్షం పడడంతో కౌండిన్య కాలవలో మొరవ నీరు ఉధృతంగా రావడంతో అప్పట్లో ప్రభుత్వ అధికారులు వాటిని తొలగించారు. తొలగించిన ప్రాంతంలోనే బంకులు ఏర్పాటు చేసేందుకు రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి అనుమతులు ఇప్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అక్కడి బాధితులు చాలా రోజులుగా ఎదురుచూసి చివరికి నిరాశ మిగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో స్థానిక నాయకుల అండదండలతో అప్రాంతంలో షెడ్లు నిర్మించుకున్నారు. ఈ స్థల విషయమై గ్రీవెన్స్ సెల్లులో జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. స్థానికంగా ఉన్న ఇబ్బందులతో అధికారులు కొంత వెనుకంజ వేయడం జరిగింది. రోజులు గడిచిన అధికారులు చర్యలు తీసుకొక పోవడంతో జిల్లా కలెక్టర్ తహశీల్దార్ రాముకు వెంటనే వాటిపై చర్య తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అధికారులు హుటాహుటిన సీఐ శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పనికుమార్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఆక్రమించిన స్థలం వద్దకు చేరుకుని జెసిబితో కూల్చేయడం జరిగింది. మరో 5 షెడ్లు ఉన్నాయి వాటిని కూడా కూల్చాలని స్థానికులు కోరగా అది కోర్టులో కేసు జరుగుతున్నదని త్వరలో వాటిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

జీవిత పోరాటం.. జీతానికై ఆరాటం

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : విశ్వవిద్యాలయమా వేతనం అందించు మా... అంటూ ద్రావిడ విశ్వవిద్యాలయ బోధనేతర తాత్కాలిక సిబ్బంది జీతానికై ఆరాటపడుతూ.. జీవితంతో పోరాటం చేస్తున్నారు. ద్రావిడ రాష్ట్రాల కూడలిలోని కుప్పం నియోజకవర్గ పరిధిలో విశ్వవిద్యాలయం ఏర్పడితే మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, స్థానిక నిరుద్యోగయువతకు ఉపాధి దొరుకుతుందని, ముఖ్యంగా పేదవిద్యార్థులకు ఉత్తమ, ఉన్నత విద్య లభిస్తుందన్న ఆశతో ఎంతోమంది రైతులు తమ జీవనోపాధిగా ఉన్న భూములను ద్రావిడ విశ్వవిద్యాలయ స్థాపనకు దారాదత్తం చేసి, విశ్వవిద్యాలయం అందించే జీతానికి ఆశ పడ్డారు. ఫలితంగా ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు మానస పుత్రిక అయిన ద్రావిడ విశ్వవిద్యాలయం ఊపిరి పోసుకుంది. ఆనాటి నుంచి దినదినాభివృద్ధి చెందుతూ వచ్చిన విశ్వవిద్యాలయం ఎంతోమంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానిక ప్రజలకు జీవనోపాధిని అందించింది. అయితే విశ్వవిద్యాలయ స్థాపనకు భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు మాత్రం తాత్కాలిక ఉద్యోగాలను కల్పిస్తూ, అరకొర వేతనంతో పనులు చేయించుకుంటున్నట్టు బోధనేతర తాత్కాలిక సిబ్బంది ఆరోపిస్తున్నారు.

విశ్వవిద్యాలయ స్థాపనకు భూములను ఇచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించిన ప్రభుత్వం భద్రత, భరోసా లేని ఉద్యోగాలను కల్పించిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన భూమిక పోషించడం జరిగిందన్నది స్థానికుల మాట. అయితే 2019 సార్వత్రిక ఎన్నికలలో వైసిపి రాష్ట్రవ్యాప్తంగా గెలుపొంది, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి విధితమే. ఆపై ద్రావిడ విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న పరిణామాలతో.. విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందకపోగా, అథఃపాతాలానికి చేరుకుందని విశ్వవిద్యాలయ తాత్కాలిక సిబ్బందితోపాటు పూర్వపు విద్యార్థుల ఆవేదన. ప్రధానంగా గత ప్రభుత్వ పాలనలో విశ్వవిద్యాలయం ఆర్థికంగా దెబ్బతినడం ప్రారంభమైందని, కనీసం సిబ్బందికి వేతనాలు అందించలేని గడ్డు పరిస్థితులను విశ్వవిద్యాలయం ఎదుర్కొంటుందని స్వయాన అక్కడి సిబ్బంది చెబుతున్నారు.



ఇది ఇలా ఉండగా విశ్వవిద్యాలయంలోని తాత్కాలిక సిబ్బంది వేతనాల కోసం నిరసన కార్యక్రమాలు తెలియజేయడం, నిరవధిక సమ్మె నిర్వహించడం, విశ్వవిద్యాలయ బంద్‌కు పిలుపునివ్వడం, పరీక్షలను అడ్డుకోవడం వంటివి పరిణామాలు చోటు చేసుకున్నాయి. అలాంటి పరిస్థితులలో ఆనాటి ప్రతిపక్ష పార్టీ అయినా తెలుగుదేశం పార్టీ నాయకులు కలుగజేసుకుని తాము అధికారం చేపడితే విశ్వవిద్యాలయ సమస్యలకు పరిష్కారం చూపుతామని, ముఖ్యంగా తాత్కాలిక సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్టుగానే 2024 సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఆపై రాష్ట్ర ముఖ్యమంత్రిగా కుప్పం విచ్చేసిన బాబు వారం రోజులలో ద్రావిడ విశ్వవిద్యాలయ తాత్కాలిక సిబ్బందికి వేతనాలు అందించాలని బహిర్గతంగానే ఆదేశాలు జారీ చేశారు. అయితే అప్పటికే 15 మాసాలకు పైగా వేతనాలు అందని తాత్కాలిక సిబ్బందిలో ఒకరు కుటుంబ పోషక భారమై, 'జీతం' అందక 'జీవితంతో పోరాడలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన సంగతి స్థానికంగా కలవరం రేపింది. అప్పుడే నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఇంచార్జ్ వీసి, రిజిస్ట్రారులు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వేతనాలు అందిస్తామని, తాత్కాలిక సిబ్బంది ఆందోళన చెందవలసిన అవసరం లేదని, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. అన్నట్టుగానే రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో తాత్కాలిక సిబ్బందికి బకాయి పడ్డ వేతనంలో కొంత భాగాన్ని వారి ఖాతాలకు జమ చేసినట్టు సిబ్బంది తెలిపారు. అయితే అదే తాము అందుకున్న ఆఖరి వేతనమని, ఆనాటి నుండి నేటి వరకు తిరిగి వేతనాలు అందుకున్న పాపాన పోలేదంటూ తాత్కాలిక సిబ్బంది చెబుతున్నారు. ఈ క్రమంలో జనవరి నెలలో న్యాక్ బృందం విశ్వవిద్యాలయంలో పర్యటించి, విశ్వవిద్యాలయ పనితీరును పరిశీలించి, విశ్వవిద్యాలయ స్థాయిని నిర్ణయించడం జరిగింది. విశ్వవిద్యాలయానికి న్యాక్ బృందం ఏ గ్రేడ్ ప్రకటిస్తే, తాత్కాలిక సిబ్బంది వేతనాలకు, వారి ఉద్యోగ భద్రతకు ఎలాంటి డోకా ఉండదని విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ప్రకటించినట్టు తాత్కాలిక సిబ్బంది ద్వారా తెలిసింది. అయితే తమ అంచనాలు తారుమారై న్యాక్ విశ్వవిద్యాలయానికి బి గ్రేడ్ ప్రకటించినట్టు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. అంతట ఉద్యోగ భద్రత మాట పక్క నుంచి, బకాయి పడ్డ వేతనాన్నైనా చెల్లించాలని తాత్కాలిక సిబ్బంది విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ విషయమై స్పందించిన అధికారులు న్యాక్ బృందం విశ్వవిద్యాలయానికి బి గ్రేడ్ ప్రకటించడంతో తాత్కాలిక సిబ్బందికి వేతనాలు చెల్లించలేమంటూ చెబుతున్నారని తాత్కాలిక సిబ్బంది ఆరోపిస్తున్నారు. అసలే చాలీచాలని జీతాలతో జీవితాలను వెల్లదీస్తున్న తాత్కాలిక సిబ్బంది అధికారుల ప్రకటన పై మండిపడుతున్నారు. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ సహకారాలు అందించిన తాత్కాలిక సిబ్బందికి బకాయి పడ్డ వేతనాలను పూర్తిగా అందించలేని అధికారులు కొండంత ఆర్భాటం చేస్తున్నారని తమ ఆగ్రహాన్ని వెల్లబుచ్చారు. ఏది ఏమైనా ప్రస్తుతం సుమారు 8 నెలలకు పైగా వేతనాలు అందక తాత్కాలిక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. ఇలాంటి పరిస్థితులలో రాష్ట్ర ముఖ్యమంత్రి తిరిగి ద్రావిడ విశ్వవిద్యాలయ వ్యవహారాలలో కలగజేసుకుని తాత్కాలిక సిబ్బందికి వేతనాలను అందించి, ఉద్యోగ భద్రత కల్పిస్తూ వారి కుటుంబాలలో వెలుగులు నింపాలని కోరుతున్నారు.

ఇంటి స్థలాలు పరిశీలించిన తహశీల్దార్



కేవీపురంలో ఇంటి స్థలాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని కేవీపురం దళితవాడలో శుక్రవారం తహశీల్దార్ కిరణ్ ఇంటి స్థలాలను పరిశీలించారు. జగనన్న పట్టాలు ఇచ్చిన వారికి ఇంటి స్థలాలు చూపాలని గతవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించడంతో స్పందించి సర్వే నెంబరు 183 స్థలాన్ని పరిశీలించారు. పది రోజుల్లో సర్వే నిర్వహించి పట్టాలు ఇచ్చిన 85మందికి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ స్థలాలు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రాజశేఖర్, వీఆర్వో దొరస్వామి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముద్దు కృష్ణమ నాయుడికి నివాళులు

ప్రజాశక్తి- విజయపురం: దివంగత ఎమ్మెల్సీ, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు 7వ వర్ధంతి సందర్భంగా మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్, గాండ్లకండ్రిగ మిట్టలో సంతాపసభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ మాట్లాడుతూ మృద్దుకృష్ణమ మృతి చెందినప్పటికీ ప్రజల హృదయాలలో సుస్థిరంగా నిలిచారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని, ఆయన అడుగు జాడల్లో నడవాలని అన్నారు. అనంతరం అన్నదానం, విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్, బాలసుబ్రహ్మణ్యం రాజు, రమేష్ రాజు, బాబు యాదవ్, దశరథరాజు పాల్గొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి- శాంతిపురం: రాళ్ళబూదుగూరు గ్రామ పంచాయతీలోని పలు ప్రదేశాలలో సామూహిక చెత్త బుట్టలను ఏర్పాటు చేశారు. గత 20 రోజులుగా రాళ్ళబూదుగూరు పంచాయతీలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి పి.స్వాతి, సర్పంచ్ లక్ష్మి మురుగేష్ నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ – స్వచ్ఛ రాళ్ళబూదుగూరు అనే నినాదంతో మనమందరం ముందుకు పోదామని పంచాయతీ కార్యదర్శి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పంచాయతీలో అన్ని గ్రామాల ప్రజలకు ప్రతి ఇంటికి చెత్త డబ్బాలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. తడి చెత్తను పొడి చెత్తను వేరువేరుగా వేయాలని గ్రామ పారిశుధ్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని అప్పుడే పంచాయతీ స్వచ్ఛ రాళ్ళబూదుగూరు పంచాయతీగా చేసుకోగలమని క్లస్టర్ ఇంచార్జ్ ఆర్ఎస్.మని అన్నారు. టిడిపి నాయకులు జయరాజు, బసవరాజు, ఉపసర్పంచ్ వెంకటరమణ, కుమార్, సురేష్, గోపినాథ్ పాల్గొన్నారు.

రోడ్లపై పేడ దిబ్బలు వేస్తే జరిమానా

ప్రజాశక్తి- కార్వేటినగరం: రోడ్లపై పేడదిబ్బలు వేస్తే జరిమాన తప్పదని ఇన్చార్జి ఈవోపిఆర్‌డి నాగరత్నమ్మ అన్నారు. శుక్రవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో పచ్చికాపల్లం రోడ్డు, డైట్ రోడ్డు, చాకలి వానిగుంట, పద్మసరస్సు రోడ్లను సర్పంచ్ ధనంజయవర్మతో కలసి సందర్శించి రోడ్లపై వేసిన పేడ దిబ్బలను జేసీబీ యంత్రం ద్వారా తొలగించారు. ఇన్చార్జి ఈవోపీఆర్డీ మాటాడుతూ నిత్యం రాకపోకలు సాగించే రోడ్లపై పేడ దిబ్బలు వేసి జనసంచారానికి ఆటంకం కల్పించినట్లయితే వారికి భారీగా జరిమాన విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే గ్రామవీధుల్లో, ఇళ్ల మధ్య పేడ దిబ్బలు వేసిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పేడ దిబ్బలు ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. రోడ్లపై పేడ దిబ్బలు కలిగిన వారు వెంటనే దూరపు ప్రాంతాలకు తరలించి పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని లేకుంటే అధికారులు దిబ్బలు తొలగించి జరిమాన విధించడం జరుగుతుందన్నారు.

యానాదుల సంఘం సమావేశం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణం ఎన్జీవో హెూమ్ నందు యానాదుల సంఘం నిర్వహించిన సమావేశం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యానాదులు హక్కులు సాధించుకోవడానికి ఐక్యమత్యంగా ఉండి పోరాడాలని సూచించారు. అలాగే కుల సభ్యుల అభివృద్ధికి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ, విద్యావంతులైన యానాదులు ప్రభుత్వ పథకాలపై కుల సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా ఆర్.కృష్ణప్ప, ఉపాధ్యక్షులు నారాయణ, కార్యదర్శిగా వెంకటరమణ, ఉప కార్యదర్శి బాబు, అశోక్, జె.కృష్ణప్ప, కోశాధికారిగా బి.గాంధీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సరస్వతి, జేజప్పలను ఎన్నుకున్నట్టు తెలిపారు.

అగ్గి తెగులు నివారణపై అవగాహన

ఏరువాక కేంద్రం డాక్టర్ సంధ్యారాణి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వరి పంటలో అగ్గి తెగులుకు మందులు పిచికారి చేసుకోవాలని ఏరువాక కేంద్ర డాక్టర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని చీకురుపల్లి గ్రామంలో ఏరువాక కార్యక్రమం వ్యవసాయ విస్తరణాధికారి సాదరయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకి అధిక యూరియా వేయడం వలన తెగుళ్ల ఎక్కువగా సోకే అవకాశం ఉందని వరి పంట అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజోల్ అనే మందును లీటర్ నీటికి 0.6 గ్రాములు కలుపుకొని పిచికారి చేసుకోవాలని లేదా కాసుగా మైసిన్ అనే మందును 2.5 గ్రాములు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడిఏ నాగపద్మిని, విహెచ్ఏ మూర్తి, విఏఏ అనిల్, రైతులు పాల్గొన్నారు

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ప్రజాశక్తి- కార్వేటినగరం: పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే అది విద్యతోనే సాధ్యమని అసిస్టెంట్ సోషల్ వెల్ఫర్ అధికారి డి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహా కళాశాలలో వసతి గృహాల్లో ఉన్న పదోతరగతి విద్యార్థులకు ప్రతిభ ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌డబ్ల్యూవో మాట్లాడుతూ పేదరికం నిర్మూలనకు విద్య ఒక ఆయుధమన్నారు. గతంలో వసతి గృహాల్లో విద్యనభ్యసించిన వారు ఎందరో ఉన్నత శిఖరాలకు ఎదిగారని అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు అభ్యసించాలని పిలుపునిచ్చారు. శ్రీ లక్ష్మి నరసింహ డైరెక్టర్లు డిలీప్ కుమార్, వసతి గృహవార్డన్లు హేమలత, చంద్రకళ, దశరథన్, సుబ్బరత్నమ్మ, వాసు, అధ్యాపకులు సీఎన్.లత, సుబ్బారావు, రఘురాం, జోగిప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త సేకరణకు మినీ ఆటో



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీలో చెత్తను సేకరించే మినీ ఆటోను శుక్రవారం స్థానిక సర్పంచ్ శ్రీ బాబు గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ప్రారంభించారు. చెత్త సమస్యను గుర్తించి సర్పంచ్ పంచాయతీ నిధులు మంజూరు చేసి కొనుగోలు చేసినట్టు తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బండ్లలో వేయాలని కోరారు. జిల్లా టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, సెక్రెటరీ మురళి పాల్గొన్నారు.

పంచాయతీలో పారిశుధ్య పనులు



ప్రజాశక్తి- ఐరాల: ఎంపీడీవో ధనలక్ష్మి ఆదేశాలతో కామినాయనపల్లి పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించడం జరిగింది. శుక్రవారం కామినాయనిపల్లి గ్రామపంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పేదదిబ్బలు, గడ్డిని చెక్కించడం జరిగింది. దోమల నివారణకు ఫాగింగ్, వీధులలో చెత్త కుప్పలను తొలగించి శానిటేషన్ చేయడం జరిగింది. పంచాయతీ సెక్రటరీ శ్యామల, సచివాలయం సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ అరుణశ్రీ ఆధ్వర్యంలో వీకోట, బైరెడ్డిపల్లి మండలాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ ప్రతినెలా మొదటి శుక్రవారం గర్భిణులు, బాలింతకుల ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ చేయడం తప్పనిసరి అన్నారు. పంచాయతీ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, బాలాంతలకు ఫుడ్ అందజేయడానికి అనుగుణంగా అంగన్వాడీ టీచర్లకు ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, టిడిపి మండలాధ్యక్షులు కిషోర్ గౌడ్ చేతుల మీదుగా ఫుడ్ సామాగ్రిని అందజేశారు.

వైసీపీ మండలాధ్యక్షులుగా శివరాజు

ప్రజాశక్తి- విజయపురం: మండల వైసీపీ అధ్యక్షులుగా విజయపురానికి చెందిన శివరాజును శుక్రవారం మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకొస్తానని, మండలంలో పార్టీని బలోపితం చేస్తామన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని, మాజీ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా జయంతి



ప్రజాశక్తి- గుడిపాల: గుడిపాల మండల ఇన్చార్జి తహసీల్దార్ జయంతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుడిపాల తహసీల్దార్‌గా పనిచేస్తున్న చంద్రశేఖరరెడ్డిని ఇటీవల చిత్తూరు అర్బన్ తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో యాదమరి రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జయంతిని గుడిపాలకు ఇన్చార్జి తహశీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో నెలసరి సమావేశం జరిగింది. ఉపాధ్యక్షులు ఆర్.విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 11వ పిఆర్‌సి బకాయిలు, డిఏ బకాయిలు, ఇంటిరియం రిలీఫ్ ఫండ్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెక్రటరీ దొరస్వామి, మురళీధర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచండి: డీఎల్పీవో

ప్రజాశక్తి- విజయపురం: పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని డీఎల్ పీవో పార్వతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పన్నూరు, సామిరెడ్డి కండ్రిగ, మాధవరంలో పర్యటించి వివిధ పనులను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడితే ఆరోగ్యంగా ఉంటారని, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం మాధవరంలో మొక్కనాటి నీళ్ల పోశారు. మొక్కలు పెంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎంపీడీవో రాజేంద్ర, సర్పంచ్లు సునంద నామనోహరరెడ్డి, సుబ్రహ్మణ్యం, మమతా శ్రీరాములు రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణం కొత్తపేట జయప్రకాష్ రోడ్డులోని శ్రీ ఓం శక్తి దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుండి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించారు. మంజులమ్మ, బాబు, మురుగేష్, బాలాజీ, మునెప్ప, చలపతి తదితరులు పాల్గొన్నారు.

దాతల ప్రోత్సాహకం అభినందనీయం

ప్రజాశక్తి- కార్వేటినగరం: విద్యాభివృద్ధికి దాతల ప్రోత్సాహకం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయ కుమార్ అన్నారు. శుక్రవారం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యలో రాణించలన్న ఉద్దేశంతో దాతలు నగదు బహుమతులు అందించి ప్రోత్సాహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం పాఠశాల కమిటీ చైర్మన్ షేక్ సంధాని మాట్లాడుతూ ఆర్కే ఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన వారు ఎందరో ఉన్నత స్థాయిలో ఉన్నారని అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని విద్యనభ్యసించాలన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాదని, క్రమశిక్షణతో పాటు కష్టపడి చదివే విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించగలని పేర్కొన్నారు. ప్రోత్సాహక నగదు బహుమతులు అందించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న దాతలకు విద్యార్థులు ఎప్పటికీ రుణపడే ఉంటారని తెలిపారు. అనంతరం 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తగతిలో 588 మార్కులు సాధించిన యశ్వంతికి రూ.33వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన బిందూ, చైతన్యలకు రూ.5వేలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈవో2 మనోజ్ కుమార్, కోడంపాణి, దాతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోత్సాహక నగదు బహుమతిని అందిస్తున్న దాతలు

రోడ్డు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న డిఎస్‌పి సయ్యద్ మహ్మద్ ఆజీజ్

ప్రజాశక్తి- విజయపురం (నగరి): విద్యార్థులు రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ విభాగం నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నగరి డిఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ మాట్లాడుతూ వాహన ప్రయాణంలో చిన్న అజాగ్రత్త తమ ప్రాణాలతో పాటు ఎదుటి వారి ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నదని అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తలకు హెల్మెట్, మోచేతులకు, మోకాళ్ళకు పాడ్స్ కూడా ధరించాలని తెలిపారు. కారు ప్రయాణంలో సీట్ బెల్ట్ ధరించడం, బస్సు ప్రయాణంలో హ్యాండిల్‌ను గట్టిగా పట్టుకొని కూర్చోవాలని కోరారు. వాహనాలను నడిపేటప్పుడు తొందరపాటు, నిర్లక్ష్యం, అజాగ్రత్త, పరధ్యానం, మొబైల్ ఫోన్లో మాట్లాడటం ప్రమాదకరమని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా జాగ్రత్త వహించాలని, కెరీర్ అభివృద్ధి మొదటి ప్రాధాన్యతగా భావించి కృషిచేయాలని సూచించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేశ్వర, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర రాజు, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎక్సమినేషన్స్ డాక్టర్ వేణుగోపాల్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వరి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ స్వాతి, డాక్టర్ గిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానసుధ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల 5వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మురుగానిపల్లెలోని న్యూయార్క్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఆర్.ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు సృజనాత్మక విద్య అందించే ఘనత విజ్ఞానసుధ విద్యాసంస్థలకే దక్కుతుందన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా ఆధునిక పద్ధతులతో బోధన చేయడం ఆ కళాశాలకే చెల్లుతుందని ప్రశంసించారు. విద్యతో పాటు ఇతర అంశాలు, ముఖ్యంగా క్రీడల విషయంలో కళాశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపడం గొప్ప విషయంగా అభివర్ణించారు. కళాశాల చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల కృషి, పట్టుదల, అధ్యాపకుల ప్రణాళికబద్ధ బోధనతో గత మూడు సంవత్సరాలుగా తమ కళాశాల విద్యార్థులే చిత్తూరు నగర టాపర్లుగా నిలవడం హర్షనీయమన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ విజ్ఞానసుధ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లీలాకుమారి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జనంలోకి జనసేన సక్సెస్

పవన్ మెచ్చిన సోమల సభ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు: సోమల మండల కేంద్రంలో నిర్వహించిన జనంలోకి జనసేన భారీ బహిరంగ సభ పూర్తిస్థాయిలో విజయవంతమైందని దీనికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన నాయకులను ప్రశంసించారని అ పార్టీ నాయకుడు, ఎన్‌విఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. పుంగనూరు మండలం చెదల గ్రామంలో ఆయన స్వగ్రామంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనంలోకి జనసేనను బహిరంగ సభను పుంగనూరు నియోజకవర్గంలో నిర్వహించడం అది పూర్తిస్థాయిలో విజయవంతం చేయడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. నాగబాబు సభ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనాత్మకమైందని, గత ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తూ నాగబాబు పుంగనూరు జనసేన అండగా ఉంటుందని పేర్కొనడం హర్షణీయమన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి పుంగనూరులో పవన్ కళ్యాణ్‌తో పెద్ద ఎత్తున సభ నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రతి మండలంలోనూ మండలస్థాయి కమిటీలు ద్వారా జనసేనను పటిష్టం చేస్తామన్నారు. నాయకులు శివ కుమార్‌రెడ్డి, నరేంద్ర రెడ్డి, నారాయణ రెడ్డి, పగడాల రమణ, చిన్నా రాయల్, నరేష్ రాయల్, విరూపాక్షి, కుమార్ రాయల్, చిన్న పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలలో రాణించాలి

ప్రజాశక్తి- కుప్పంటౌన్: విద్యార్థులు క్రీడలలో రాణించాలని బిసిఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు తెలిపారు. శుక్రవారం బిసిఎన్ విద్యాసంస్థలలో భాగమైన కుప్పం నర్సింగ్ కళాశాలలో వార్షిక క్రీడోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ విమల జోసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ సునీల్ రాజ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల యువతకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం కళాశాల తరపున నిర్వహించిన వివిధ క్రీడాపోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను, బహుమానాలను అందజేశారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి సాగర్ రాజు, ఫిజికల్ డైరెక్టర్ సతీష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

స్వచ్ఛమైన తాగునీటికి క్లోరినేషన్ ప్రక్రియ

ప్రజాశక్తి- సోమల

పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రతి తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు వెళ్లే నీటి పైపుల వద్ద క్లోరిన్ టాబ్లెట్లను వేసి తద్వారా క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందించడం జరుగుతుందని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ అన్నారు. పంచాయతీ పరిధిలోని సామాదిగుట్టపల్లి, తొప్పన్నగారి పల్లి, ఊర మాదిగపల్లి గ్రామాలలో క్లోరిన్ టాబ్లెట్లను పైపులలో వేసి ట్యాంకులకు సదరు నీటిని సరఫరా చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నీటిని తాగడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా పరిశుభ్రమైన నీరు వారికి అందినట్లు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

పలు దేవాలయాల్లో బ్రహోత్సవాలు

ప్రజాశక్తి- వీకోట: బ్రహ్మ ముహూర్తాలను పురస్కరించుకొని శుక్రవారం మండలపరిధిలో నూతనంగా నిర్మించిన పలు ఆలయాల కుంభాభిషేకాలు, వేణుగోపాల స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బైరుపల్లి పంచాయతీ బంగ్లా ఊరులో నూతనంగా నిర్మించిన అమ్మవారి ఆలయంలో ఘనంగా బాట గంగమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, మహా కుంభాభిషేకం, హోమాలు నిర్వహించారు. ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టాపన పేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. పాముగానిపల్లి పంచాయతీ వైస్ కుప్పం గ్రామంలో దాతల సహకారంతో నిర్మించిన గంగమాంబ నూతన దేవాలయంలో గత మూడు రోజులుగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి శుక్రవారం తెల్లవారుజామున ప్రాణ ప్రతిష్టాపన మహా కుంభాభిషేకం నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, టిడిపి మండలఅధ్యక్షుడు రంగనాథ్, క్లస్టర్ ఇంచార్జ్ రాంబాబు, ధీరజ్ పాల్గొన్నారు.



క్రైం న్యూస్

రైల్వే పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక రైల్వేస్టేషన్లో శుక్రవారం అనుమానస్పదంగా తిరుగుతున్న మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ ప్రకాష్ అశ్రుభా చిత్తూరు రైల్వే పోలీస్ అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా మహారాష్ట్రలో తనపై నాలుగు కేసులు ఉన్నట్లు అక్కడి నుండి ఆంధ్ర, తమిళనాడు ప్రాంతంలో చోరీలకు పాల్పడేందుకు వచ్చినట్లు ఒప్పుకున్నట్లు చిత్తూరు రైల్వే ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. సదరు నిందితుడు నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజాశక్తి- కార్వేటినగరం: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తెల్లగుంట సమీపంలో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 42 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి తెల్లగుంట సమీపంలోని చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారి పై ఓ చెట్టు నీడలో ఆపస్మారక స్థితిలో పడి ఉండటం గుర్తించిన 108 వాహనానికి సమాచారాన్ని అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది పరిశీలించి అతను అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని అతని ఆచూకి కోసం అతని వద్ద ఉన్న లగేజీ బ్యాగ్ను పరిశీలించారు. అందులో సుత్తి, కటింగ్ బ్లేడ్ ఉన్నట్లు గుర్తించారు. మృతుడికి సంబంధించిన వివరాలు లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడు తెలుపు, బ్లూకలర్ చెక్ షర్టు, గళ్లలుంగీ ధరించి ఉన్నాడని, ఆ చూకి తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం తెలపాలని పేర్కొన్నారు.

రక్షణ కల్పించండి..

మీడియాను ఆశ్రయించిన ప్రేమ జంట



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఇష్టపూర్వకంగానే ప్రేమపెళ్లి చేసుకున్నామని, తమను విడదీయడానికి ప్రయత్నిస్తున్న తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని ప్రేమ జంట చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాను ఆశ్రయించారు. కార్వేటినగరం మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన పవన్, వెదురుకుప్పం మండలం పెద్దపొడి చేను గ్రామానికి చెందిన ప్రేమ గత నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నామని, పెళ్లి కూడా చేసుకున్నట్లు తెలిపారు. ప్రేమ, పెళ్లి వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలియడంతో తల్లిదండ్రులు బంధువులకిచ్చి బలవతంగా పెళ్లి చేయాలని చూశారని ప్రేమ తెలిపారు. మూడు రోజులకు క్రితమే పెళ్లి చేసుకున్నామని, ఈ విషయం ఇంటిలో తెలియడంతో వారి నుంచి ప్రాణహాని ఉందని, వారి నుంచి పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు.

నీలగిరి తోట దగ్ధం

ప్రజాశక్తి- చౌడేపల్లి: చౌడేపల్లి మండలం పొదలపల్లి గ్రామసమీపంలోని నీలగిరి తోట శుక్రవారం దగ్ధమైంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొదలపల్లి బి.నరేష్ చెందిన నీలగిరి తోటలో మంటలు చెలరేగాయని, సమాచారం అందడంతో వెంటనే సెల్ఫ్ ట్యాంక్ నీటితో మంటలను పూర్తిగా అదుపు చేసి చుట్టుపక్కల నివాస గృహాలకు అగ్ని వ్యాపించకుండా నిరోధించడం జరిగిందని తెలిపారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సిగిరెట్ తాగి ఆర్పకుండా వేయడం వలన అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వరుణ్ తేజ

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పట్టణంలోని షాహి ఎక్స్‌పోర్ట్స్ పరిశ్రమలో మండల న్యాయసేవ అధికార సంస్థ తరవున న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుప్పం జూనియర్ సివిల్ జడ్జ్ వరుణ్ తేజ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా పరిశ్రమలలో పనిచేసే కార్మికులు కార్మిక చట్టాలపై, మహిళలు మహిళా చట్టాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం పరిశ్రమలో కార్మికులకు అందుత్ను సౌకర్యాల గురించి, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. మహిళలపై లైంగిక వేధింపులు చట్టరీత్యా నేరమని తెలియజేస్తూ, మహిళలను ఎవరైనా వేధిస్తే చట్టరీత్యా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కుప్పం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రప్ప, కార్యదర్శి ఉదయ్ కుమార్, పుష్పలత, పారా లీగల్ వాలంటర్ మహేష్, లయన్స్ క్లబ్ సభ్యులు సెల్వం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.